క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో తానూరు తెలంగాణ గ్రామీణబ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్ష్యరాస్యతపై గురువారం ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సేవలు, ఇన్సూరెన్సుల గురించి బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ వివరించారు. డ్వాక్రా సంఘ మహిళల సభ్యులు బ్యాంక్ ద్వారా రుణాలు పొంది వ్యాపారం చేసి అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవలో పాల్గొని మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్ ఫుండలిక్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌తోపాటు గోపాల్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

పోటీపరీక్షల పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న శివకృష్ణ

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయానికి దాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ అందించిన రూ.20వేల విలువైన పోటీపరీక్షల పుస్తకాలను మస్కాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు చిలుకూరి శివకృష్ణ గురువారం అందజేశారు. ఇటీవల విన్నర్ పబ్లికేషన్ సలహాదారు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ మండల పర్యటన సందర్భంగా పోటీపరీక్షల అభ్యర్థులకు పుస్తకాలు అందిస్తానని హామీఇచ్చారు. ఉపాధ్యాయుడు ద్వారా రెండుసెట్లను లైబ్రరీయన్ పృథ్వీ అందించారు. గ్రూప్–1 మెయిన్స్ నూతన ఎడిషన్, గ్రూప్–2, 3, 4, గురుకులాల, కానిస్టేబుల్, ఎస్సై పోటీపరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశారు. పాఠకులు వేణుగోపాల్, విజేందర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బాబుల్‌గాం పంచాయతీగా ఏర్పాటు చేయాలి



మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని బాబుల్‌గాంను పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. గ్రామస్తులు దేగాం గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో కలిసి విన్నవించారు. ఎగ్గాం పంచాయతీకి అనుబంధమైన బాబుల్‌గాం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటుచేయాలని కోరారు. మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

మతగురువు ప్రచారం అడ్డగింత

సారంగపూర్: మండలంలోని లక్ష్మీనగర్ తండాలో ఓ మత గురువు బుధవారం రాత్రి చేస్తున్న ప్రచారాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. తండా మొత్తం బంజారా సమాజమని ఎవరూ అన్యమత ప్రచారం చేయొద్దని సూచించారు. ఒకవేళ అలా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో సదరు మతగురువు అక్కడినుంచి వెళ్లిపోయారు.

ఎస్సైగా సందీప్ బాధ్యతలు



సందీప్

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఎల్.సందీప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజేశ్వర్ గౌడ్ బదిలీపై నిర్మల్‌కు వెళ్లారు. తానూర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.సందీప్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు అనంతరం గ్రామాలను ఆయన సందర్శించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న శిక్షణ

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో చేతిపంపు, ఇతర మరమ్మతుపై పంచాయతీ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ రెండోరోజు కొనసాగింది. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ, చేతిపంపులకు మరమ్మతు పనులకు సంబంధించి నిర్మల్‌కు చెందిన ముత్యన్న మంగళవారం శిక్షణ అందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మీనారయణ, ఏఈ రాజన్న, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో కొలువుదీరిన దుర్గామాత



భైంసాటౌన్: గణేశ్‌నగర్‌లో శ్రీరామచైతన్య యూత్ ఆధ్వర్యంలో..



ముధోల్‌లో ..



లోకేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

కొలువుదీరిన దుర్గామాత

భైంసాటౌన్/తానూరు/లక్ష్మణచాంద/కుభీర్/కుంటాల/భైంసారూరల్/ముధోల్/ఖానాపూర్/సోన్/లోకేశ్వరం/సారంగపూర్: జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దుర్గామాత విగ్రహాలను ప్రధాన వీధుల గుండా డప్పువాయిద్యాల మధ్య స్థానికులు శోభాయాత్రగా వెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. 9 రోజులపాటు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలువనున్నారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు మొదటిరోజు బాలత్రిపుర సుందరిదేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. శరన్నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని కొందరు భవానీ దీక్ష తీసుకున్నారు. సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన చింతకింది శ్రీనివాస్ దంపతులు అమ్మవారి విగ్రహాన్ని శ్రీ గాయత్రీదేవి అమ్మ సేవా సమితి సభ్యులకు అందజేశారు.



కుంటాలలో..



లోకేశ్వరం: పంచగుడిలో..



ముధోల్: పూజలు చేస్తూ..



లక్ష్మణచాంద మండలం పొట్టపల్లిలో..



సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో..



ఖానాపూర్: తర్లపాడ్‌లో పూజలు చేస్తున్న భక్తులు



సారంగాపూర్: జామ్‌లో పూజలు చేస్తూ..



తానూరు: ఎల్వి గ్రామంలో..

వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

పెంబి: 70వ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా పెంబి అటవీ రేంజ్ పరిధిలో గురువారం మండల కేంద్రంలో అటవీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఆర్వో రమేశ్‌రావు, డీఆర్వో ప్రతాప్‌నాయక్, ఎఫ్ఎస్‌వో సుందర్, ఎఫ్‌బీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరులో రెండో షిర్డీగా ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్న హారతిలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలోని మర్రెన్న అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సాయారెడ్డి, ముత్తగౌడ్, శేఖర్‌రెడ్డి, నాలం గంగాధర్, భూమేష్, భోజారెడ్డి ఉన్నారు.

'బీజేపీ దీక్షలు హాస్యాస్పదం'

ఖానాపూర్: గత పదేళ్లగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏనాడు రైతుల సమస్యలపై పట్టించుకున్న పాపానపోలేదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతు సమస్యలను గాలికొదిలేసిన బీజేపీ నాయకులు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ దీక్షలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం మద్దతు ధర ఇవ్వాలన్నారు.

14న బతుకమ్మ నిమజ్జనం

ఖానాపూర్: దుర్గా నవరాత్రి ఉత్సవాలతోపాటు దసరా తర్వాత మరుసటి రోజు ఖానాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనం ఉంటుందని వీడీసీ నాయకులు పేర్కొన్నారు. ఖానాపూర్, తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో నిర్ణయించినట్లు తెలిపారు.



కడెం ప్రాజెక్ట్

నిండుగా.. కడెం

కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, గురువారం 700 అడుగులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎడమ కాలువకు 878, కుడి కాలువకు 8 క్యూస్కెకుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై చర్యలు తీసుకోవాలి

కుభీర్: మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన మైనర్ బాలికను కుభీర్‌కు చెందిన యువకుడు మాయమాటలు చెప్పి బుధవారం తీసుకెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు స్థానిక తహసీల్దార్ ఎం.సోముకు వినతిపత్రం అందజేశారు. యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేయాలన్నారు. నాయకులు అభిశేఖర్, గంగాధర్, దత్తాత్రి, మల్లేశ్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

సంక్షిప్త వార్తలు

19న సత్యపాన సమావేశం

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 19న సత్యపాన సమావేశం ఉంటుందని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి ఘణపురం రాజేశ్వర్ అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సత్యపాన సమావేశ యోజన బైటాక్‌లో మాట్లాడారు. 19న జరిగే సత్యపాన సమావేశానికి 20 గ్రామాల నుంచి 93 మంది కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక్ కాశవేని ప్రణయ్, సహ కార్యదర్శి దర్శనాల రాకేశ్, జిల్లా గోరక్ష ప్రముఖ్ జెట్టి వెంకటేశ్, నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దు, సాయి, ఉదయ్, ప్రవీణ్, సుబ్బు పాల్గొన్నారు.

బీఎల్వోలు అందుబాటులో ఉండాలి

లోకేశ్వరం: బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల బీఎల్‌వోలను ఓటరు నమోదుకు సంబంధించిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను బీఎల్వోలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌ఐ బాల కిషన్, లలిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సర్వేకు సహకరించండి

సోన్: కడ్తాల్ గ్రామంలో గురువారం ఎల్ఆర్ఎస్ సర్వేకు సహకరించాలని ఆర్‌ఐ రఫీక్ కోరారు. గ్రామంలో 1300ల దరఖాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, కార్యదర్శి సమయ్యద్ తస్కీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాల: నిబంధనలకు లోబడి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని క్షేత్రస్థాయిలో గురువారం ప్లాట్లను పరిశీలించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, ఆర్‌ఐ అడెల్లు, కార్యదర్శులు రాజబాపు, సతీశ్ పాల్గొన్నారు.

'డీజేకు అనుమతి లేదు'

లోకేశ్వరం: బతుకమ్మ పండగలకు డీజేలు అనుమతి లేదని ఎస్సై అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గత గణేశ్ నిమజ్జన సమయంలో డీజేలు పెట్టడంతో ప్రజలకు శబ్ద కాలుష్యం ఏర్పడిందన్నారు. గ్రామాల్లో ఎవరైతే డీజేలు ఏర్పాటు చేస్తే యజమానులు, నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు.

'కొండా' మంత్రి పదవికి రాజీనామా చేయాలి

ఖానాపూర్: కొండా సురేఖ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మహిపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పి ఆమె వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

తహసీల్దార్ వాహన వివరాలపై ఆర్టీఐ దరఖాస్తు

కడెం: తహసీల్దార్ సుజాత వాహన వినియోగ వివరాలు తెలపాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు హపవత్ రాజేందర్ ఆర్టీఐ దరఖాస్తు చేసుకున్నారు. డీటీ, అప్పిలేట్ అధికారి శంకర్‌కు గురువారం ఆర్టీఐ దరఖాస్తు అందజేశారు. ప్రభుత్వం నుంచి వాహన భత్యం తీసుకుంటూ, కార్యాలయ సిబ్బందిని డ్రైవర్‌గా పెట్టుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.





భైంసారూరల్: ఇలేగాంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తానూరులో..



భైంసారూరల్: ఇలేగాంలో



కుంటాలలో..



తానూరులో బతుకమ్మతో వెళ్తున్న మహిళలు



బాసరలో బతుకమ్మతో మహిళలు



కుభీర్‌లోని రాంనగర్‌లో..

బతుకమ్మ సంబురాలు

భైంసారూరల్/తానూరు/ముధోల్/కుభీర్/కుంటాల/బాసర: జిలాల్లో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాల్లో అంటూ పాట పాడుతూ కోలాటాలతో నృత్యం చేశారు. పలుచోట్ల చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



మాలధారణ చేసిన భక్తులు

నిర్మల్‌టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో గురువారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో దాదాపు 3 వేలకు పైగా భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు వెంకటాచారి, ఆలయ కమిటీ సభ్యులు, పూజార్లు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద ఆవాసంలోని అనాథ పిల్లలకు లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన రమలత–దేవేందర్ రెడ్డి దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. వారి కూతురు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఆవాసంలో అనాథ పిల్లల మధ్య వేడుకలు నిర్వహించారు. 32 మంది పిల్లలకు దసరా పండుగ సందర్భంగా కొత్త బట్టలు అందించారు. అలాగే, ఒక పూట భోజనం, పండ్లు, ఆశ్రమానికి ఆరు ఫ్యాన్లు అందజేశారు. ఆవాస అధ్యక్షులు, నిర్వాహకులు, తదితరులున్నారు.

డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభం

ఖానాపూర్: కుటుంబ డిజిటల్ కార్డుల జారీలో భాగంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన మండలంలోని కొత్తపేట్‌లో గురువారం సర్వే చేపట్టారు. నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు తదితర అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

మూడోరోజు విధులు బహిష్కరణ

నిర్మల్‌టౌన్: తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మూడో రోజు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నిరసనలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యపై కాలనీవాసులు కాంగ్రెస్ నేతల దృష్టికి తెచ్చారు. వారు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. రాజ్‌కుమార్, చరణ్, రమేశ్, సురేశ్, విజయ్, సంతోశ్, కిరణ్, జేఎల్ఎం నర్సయ్య ఉన్నారు.